# 31. ఆభరణాలు

తన ఆఫీసు మేనేజరుగారింట్లో జరిగిన విందునాటి సాయింత్రం - లాంటిన్ ఆమెను మొదటిసారి కలుసుకొని, 'ప్రేమ'లో పడ్డాడు. ఆమె - ఆ ప్రాంతాల్లోనే పన్నులు వసూలుచేసే గుమాస్తా కూతురు. ఆమె తండ్రి అప్పటికి కొద్ది సంవత్సరాల క్రితమే చనిపొయ్యాడు. ఆమె తల్లి - కూతురికి కాస్త మంచి సంబంధాన్ని చూద్దామనే ఆశతో, నివాసాన్ని పారిస్ పట్టణానికి మార్చి, కొద్ది రోజుల్లోనే ఇరుగు పొరుగుల స్నేహాన్ని సంపాయించ గలిగింది. ఆ కుటుంబం బీదదైనా, మంచి గౌరవ మర్యాదలు గలది. ఆమె సౌందర్యమూ, ముఖ కళా, నిరాడంబరతా - ఆమెలో దేవత్వాన్ని స్ఫురింప జేసేవి. ఆమె ముఖంలో గొప్ప 'విశ్వాస పాత్రత' కనిపిస్తుంది. సత్ప్రవర్తనగల భర్త ఆమెకు ఎంతైనా తగినవాడు. ఆమె హృదయాన్ని విప్పి చెప్పే వెన్నెల చిరునవ్వు దాదాపు అందరినీ ఆకర్షించి, "ఆమె గొప్ప అదృష్టవంతుడికి భార్యవుతుంది; ఇంతకన్న మంచిపిల్ల ఇంకెక్కడా దొరకదు" అనిపించేది.

లాంటిన్ ఆమెను వివాహమాడాక - అతని సౌఖ్యం వర్ణనాతీతం. ఎంతో తెలివితేటల్తో, అతి పొదుపుగా ఆమె సంసారం చేసినా, ఐశ్వర్యవంతుల్లాగు వారు జీవించ గలిగేవారు. తన మీద ఆమె చూపే లక్ష్యంలో అతను ఆరు సంవత్సరాలుగా పూర్తిగా ఆమెను ఆరాధించాడు. కాని తనకు ఇష్టంలేనివి - రెండు అభిరుచులు ఆమెలో అతనికి కనిపించేవి. ఒకటి - తరుచుగా వినోద ప్రదర్శనాలకు వెళ్ళటం; రెండు - ఇమిటేషన్ నగలమీద ఎక్కువ ఇష్టాన్ని చూపుతూ వాటిని ఉపయోగించటం.

ఆమెకు పెద్దపెద్ద ఉద్యోగస్తుల భార్యలతో స్నేహం వుండటంవల్ల - థియేటర్లలో బాక్స్ టికెట్లు వచ్చేవి. ఆమె భర్తనుకూడా వెంట రమ్మని బతిమాలేది. కాని పగలల్లా ఆఫీసులో పనిచేసి అలసివుండటంవల్ల అతను వెళ్లలేక - ఏ స్నేహితురాలి వెంటన్నా వెళ్ళమని, ఆమెను మారు బతిమాలేవాడు. దీనికి ఆమె మొదటి రోజుల్లో ఒప్పుకునేది కాదు కాని, తరువాత భర్త సౌఖ్యంకోసం ఒప్పుకోక తప్పిందికాదు; ఇది అతనికి ఒక పెద్ద బరువు తప్పినట్టయింది.

అధికంగా థియేటర్లకు వెళ్ళే ఆమె అలవాటు క్రమంగా ఆమెలో ఆభరణాలు గొప్ప అభిరుచిని రేపింది. ఆమె దుస్తులు - విలువైనవి కాక పోయినా, మంచి అభిరుచితో కూడుకొని వుండటంవల్ల - ఆమె మధుర మూర్తికి మరింత మెరుగు పెట్టేవి. ఆమె చెవులకు రెండు పెద్ద లోలాకుల్ని ధరించేది; అవ్వి అసలు రత్నాలు పొదిగిన వాటివిలాగు ధగధగా మెరిసేవి. ఇది కాక ఆమె పెద్ద మాయముత్యాల గొలుసును మెడలో వేసుకునేది. రంగురంగుల గాజుగుళ్ళు గుచ్చబడ్డ ఇంకో చిన్నహారం కూడా ఆమె మెడలో వుండేది.

ఈ రకం మాయనగల్ని ఏవగించుకునే భర్త అభిరుచి దీనికి దెబ్బతినేది. అనేవాడు: "అసలు రూపంలోని ఆభరణాల్ని కొనుక్కోలేని వాళ్ళకు - వాళ్ళకున్న సౌందర్యమే చాలు - ఎందుకంటే - సౌందర్యాన్ని డబ్బుతో కొనుక్కోలేంగా!"

దీనికి ఆమె చిరునవ్వుతో సమాధానం చెప్పేది. "దీనికి నన్నేం చెయ్యమంటారూ? ఇవ్వంటే నాకు చాలా ఇష్టం. మీరన్నది నిజమే కాని, ఎవరి పిచ్చి వాళ్ళకు ఆనందం...అసలు ఆభరణాలుంటే వాటినికూడా ధరించే దాన్నేగా!"

తరువాత తన మెడలోని మాయముత్యాల గొలుసును తీసి వేళ్ళమీద తిప్పుతూ, "చూడండి : దీని పనితనం ఎంత గొప్పగా వుందో! చూసిన ప్రతివాళ్ళూ ఇవి మంచి ముత్యాలేనంటారు-" అనేది.

అతను నవ్వి ఆమె అభిరుచి రోజురోజుకూ కిందికి పోతుందనే వాడు.

ఒక్కో సాయంత్రం ఆమె ఆభరణాల పెట్టెతో భర్త దగ్గరకువచ్చి - ఒక్కో ఆభరణాన్నే తీసి దాన్ని పొగిడేది. ఇది ఆమెకు నిగూఢ ఆనందాన్నిస్తోందని గ్రహించిన భర్త - చూస్తూ ఊరుకునే వాడు.

ఒక చలికాలం రాత్రి ఆమె థియేటర్ నుంచి జ్వరంతో తిరిగి వొచ్చింది. మరి వారం రోజులకు నిమోనియాతో ఆమె మరణించింది.

లాంటిన్ దాదాపు పిచ్చివాడయ్యాడు. ఒక్క నెలలోనే జుట్టు తెల్ల బడేటంతటి నిరాశ అతనిలో పనిచేసింది. రోజంతా ఆమెకోసం ఏడ్చేవాడు.

అతని ఆత్మ భరించలేనంతగా బాధపడేది. ఆమె చిరునవ్వు, కంఠధ్వని - ప్రతి కదలికా జ్ఞాపకం వచ్చి, బాధ పెట్టేది. కాలంకూడా అతనికి శాంతి ఇవ్వలేదేమో ననిపించింది. ఆఫీసులో ఇతర గుమాస్తాలతో లోకాభి రామాయణం మాట్లాడుతూండగా - ఉన్నట్టుండి అతని ముఖం ఉబ్బి, కంటివెంట నీరు కారేది. అతని ముఖకళ క్షణంలో గుర్తించలేని మార్పుల్ని పొందేది. చప్పున కుమిలి ఏడ్చేవాడు. ఇంటిదగ్గర భార్య గదిలోనే కూర్చొని ఆమెకు సంబంధించిన ప్రతి వస్తువునూ చూసి బాధపడేవాడు. ఆమె బట్టలు పుస్తకాలు, పెట్టెలు - ఆమె పోయిననాడు ఏ స్థానాన వుండేవో, అక్కడే ఉండేవి.

ఈ విధంగా అతనికి జీవితం అతి దుర్భరమైంది. ఇదివరకు భార్య ఆధిపత్యం కింద అతని జీతంతో అన్నీ సమకూరేవి. ఇప్పుడా జీతం అతనికే చాలటంలేదు. విలువైన భోజన పదార్థాలతోనూ రుచికరమైన బ్రాందీలతోనూ ఆమె ఎలా యీ సంసారాన్ని నడిపేదో అతనికి ఆశ్చర్యంగా ఉండేది. ఇతరత్రా డబ్బు వచ్చేమార్గం లేకపోవటంవల్ల పూర్వంలాగు అతని కిప్పుడు జరుగుబాటు లేకుండా పోయింది. క్రమంగా అతనికి అక్కడక్కడ అప్పులు పెరిగినాయ్! ఎంతకొద్దిలో జీవితాన్ని ముడుచుకుందామన్నా అతని జీతం ఏవిధంగానూ చాలటంలేదు. ఒకనాటి ఉదయానికి అతని జేబులో దమ్మిడి కూడా లేదు. ఇంకో వారానికి కాని జీతం రాదు. ఇంట్లోని వస్తువుల్లో ఏదోవొకటి అమ్మాల్సిన అవసరం కనిపించింది. భార్య మరణించే సమయాన కూడా ఆమె మాయనగలమీద అతనికి ద్వేష భావం ఉండేది. అవ్వి ఎదుట కన్పిస్తూ అతన్ని మరీ బాధించేవి. చివరకు వాటిని అమ్మేందుకు నిశ్చయించుకున్నాడు.

ఆమె మరణించేవరకూ కూడా యీమాయనగల్ని కొని జాగర్త పరుస్తూండటంవల్ల చాలాసేపు వెతికాక కాని అతనికి అన్నీ దొరకలేదు. కొంతసేపు ఆలోచించి ఆమె రోజూధరించే హారాన్ని అమ్మాలనుకున్నాడు. ఉన్నవస్తువుల్లో మంచి పనితనం వున్నది అదే అవటంవల్ల - దానికి ఐదు రూపాయిల ధర రావొచ్చు!...మెల్లిగా దాన్ని జేబులో వేసుకొని బజారువెళ్ళి, రోడ్డు మీద నడుస్తూ కాస్త నమ్మదగ్గ నగల షాపుకోసం వెతకసాగాడు. చివరకు ఒక షాపు కనిపించింది. ఇంత కొద్ది ఖరీదు గల మాయ ఆభరణాన్ని అమ్ముతూ తన బీదరికాన్ని చూపాల్సి వచ్చినందుకు అతను సిగ్గుపడుతూ, మెల్లిగా షాపులోకి వెళ్ళి అన్నాడు: "ఇది ఎంత ఖరీదుకు మీరు కొనగలరో చెప్తారా?"

షాపు యజమాని గొలుసును చేతులోకి తీసుకొని అటూ ఇటూ తిప్పూతూ పరీక్షించి, భూతద్దాలతో చూసి పారిభాషలో తన గుమాస్తాతో ఏమేమో మాట్లాడి - దాన్ని దూరాన్నుంచి చూసి, రెండు మూడుసార్లు తూచాడు. ఇదిచూసి లాంటిన్ - అది మాయవస్తువని తనకు తెలుసుననీ, అదేమంత ఖరీదైనది కాదని తను ఎరుగుదుననీ చెప్దామనుకున్నాడు; కాని అప్పుడా షాపుయజమాని అన్నాడు : "ఇది మూడు నాలుగువేల రూపాయిల దాకా ఉండవొచ్చు - మీకిది ఎక్కడిదో చెప్పేదాకా, నేను మాత్రం కొనలేను."

లాంటిన్ కళ్ళు పెద్దవయినాయ్. అతను ఆశ్చర్యంతో నోరు తెరచి, అనుమానంతో అడిగాడు: "ఐతే......మీరు చెప్పింది...నమ్మకమేనా!"

లాంటిన్‌ను అర్థంచేసుకోలేక వ్యాపారస్తుడు అన్నాడు: "మీకింకా ఎక్కువవస్తుందని నమ్మకముంటే ఇంకోచోటగూడా ప్రయత్నించండి. నాకుమాత్రం దాని విలువ - నాలుగువేలు! అంతకన్నా మీకు ఎక్కువ రాకపోతే మీరు మళ్ళీ ఇక్కడికే రండి-"

ఆశ్చర్యంతో మూగవోయి గొలుసు తీసుకొని - షాపు బైటికి వొచ్చాడు. ఒంటరిగా కూర్చొని దీని విషయం ఆలోచిద్దామనిపించింది...కాని వీధిలోకి రాగానే తనలో

తను నవ్వుకొని అతను అనుకున్నాడు; 'ఎంతమూఢుడు! అతనన్న ప్రకారం నేను అమ్మినట్టయితే? వాడికి అసలు వస్తువయిందీ, మాయవస్తువయిందీ తెలియకపోతే...?"

పైక్స్‌వీధిలోని ఇంకో నగలవర్తకుడికి ఆ గొలుసును చూపాడు. వాడు దాన్ని చూడగానే "ఇది నేను గుర్తించగలను- దీన్ని మేము అమ్మివున్నాం-" అన్నాడు.

లాంటిన్ తికమకపడుతూ దాని విలువ అడిగాడు.

"నేను ఐదు వేలకు అమ్మాను; ఇప్పుడు నాలుగు వేల మూడు వందలకు కొనగలను...కాని ఇది మీ చేతులలోకి ఎలా వచ్చిందో చెప్పాలి-"

లాంటిన్ భరించలేనంత ఆశ్చర్యంతో కుర్చీలో కూలబడుతూ అన్నాడు: చూడండి..సరిగ్గా పరీక్షించండి... అది మాయవస్తువని నా నమ్మకం-"

"మీ పేరేమిటో చెప్తారా?" అన్నాడు వ్యాపారస్తుడు.

"తప్పకుండా......నాపేరు లాంటిన్...క్రుక్స్ కంపెనీలో గుమాస్తాను. మార్టైయిర్స్ వీధిలో - పదహారో నంబరు ఇంటిలో వుంటున్నాను-"

వ్యాపారస్తుడు తన అమ్మకం పుస్తకాన్ని తీసి, కొంతసేపు వెతికి అన్నాడు: "అవును - దీన్ని మేము - మీరు చెప్పిన ఎడ్రసుకు మాడం లాంటిన్‌కు - 20-వ జూలై, 1876 న....అందించాము-"

లాంటిన్ ఆశ్చర్యంతోనూ, వ్యాపారస్తుడు మోసం జరుగుతుందేమోననే అనుమానంతోనూ ఒకర్నొకరు చూసుకున్నారు.

వర్తకుడు అడిగాడు : "మీరు దీన్ని ఒక రోజు నా దగ్గర వుంచగలరా? మీకు రసీదు ఇస్తాను-"

లాంటిన్ ఒప్పుకొని, రసీదు జేబులో పెట్టుకొని బైటపడ్డాడు. ఆ వీధి దాటి, మరోవీధి చివరి దాకా వెళ్ళాక కాని, తను దారితప్పి నడుస్తూన్నట్టు అతనికి తోచలేదు. అంత విలువైన ఆభరణాన్ని కొనటం తన భార్యకు ఏ విధంగానూ సాధ్యం కాదు. ఏ విధమైన అవకాశమూ వుండేందుకు వీల్లేదు...పోతే, అది ఏదన్నా బహుమాన రూపంలో వచ్చి వుండాలి. బహుమానం....ఐతే ఎవరి దగ్గర్నుంచి? ఎందుకు?

ఈ అనుమానం కలగగానే నడుస్తూన్న వాడల్లా వీధిలో నిలబడిపొయ్యాడు. ఆమె! తన భార్య! ఇతర ఆభరణాలు కూడా బహుమాన రూపాన్నే వచ్చినవై వుంటై! అతని కాలికింది గడ్డి నేలంతా ఒణికింది. దూరాన అతనికి కన్పిస్తూన్న పెద్ద చెట్టొకటి ఒణికి - విరిగి, కిందపడ్డది. అతను రెండు చేతులూ పైకి ఎత్తి నడవబోయి, తెలివితప్పి కిందపడ్డాడు. దారేపొయ్యేవాళ్ళు అతన్ని హాస్పిటల్‌కు జేర్చారు. అక్కడ అతనికి తెలివి వొచ్చింది. మెల్లిగా ఇంటికిజేరి, గది తలుపు వేసుకొని, పెద్దగా ఏడుస్తే ఎవరికన్నా వినిపిస్తుందేమోనని, గుడ్డ నోటిలో పెట్టుకొని వెక్కి వెక్కి ఏడ్వసాగాడు. అలసటతో ఆ

రాత్రి అతనికి మంచి నిద్రపట్టింది. ఉదయాన సూర్యుడే అతన్ని నిద్రనుంచి మేల్కొల్పాడు. అతను ఆఫీసుకు వెళ్దామనుకున్నాడు. కాని జీవితంలో ఇంత పెద్దదెబ్బ తిన్నాక, ఆఫీసులో పనిచెయ్యటం అసాధ్య మనిపించింది; ఆ నాటికి శెలవు రాద్దామనుకున్నాడు... వెంటనే తను నగలవర్తకుడి దగ్గరకు వెళ్ళాలనే మాట గుర్తొచ్చి సిగ్గుతో కుంగిపొయ్యాడు. ఈ సమస్య విషయం చాలాసేపు ఆలోచించాడు! ఏమైనా ఆ గొలుసును షాపువాడి దగ్గర ఉండనివ్వటం ఏమాత్రమూ మంచిదికాదు.... వెంటనే కోటువేసుకొని బజారుకు బయలుదేరాడు.

ఆ రోజు ఉత్సాహంగా వుంది. అతనికి ప్రజలంతా సంతోషంతో వున్నట్టు కనిపించింది. జేబుల్లో చేతులు పెట్టుకొని, బజారులో చకచకా నడిచే వ్యక్తుల్ని చూసి –నిజంగా డబ్బున్నవాళ్ళు ఎంత అదృష్టవంతులో ననుకున్నాడు! డబ్బుంటే మానవుడు తన దుఃఖాల్నీ చాలావరకు మరిచిపోవచ్చు! విసుగు లేకుండా యీ గోళంలోని అనేక వింతప్రదేశాల్ని చూస్తూ జీవితాన్ని గడపవచ్చు. తనే భాగ్యవంతుడైతే?–

నిన్నటినుంచీ తనేమీ తినకపోవటంవల్ల అతనికి ఆకలిబాధ బాగా తెలుస్తోంది. కాని జేబులో దమ్మిడీకూడా లేదు. వెంటనే అతనికి ఆ గొలుసు సంగతి జ్ఞాపకం వచ్చింది. నాలుగువేల మూడు వందల రూపాయలు! ఎంత డబ్బు! పైర్స్‌వీధికి వచ్చి ఆ షాపుకు ఎదురుగా అటూ ఇటూ తిరగ సాగాడు. ఇరవైసార్లు షాపులోకి వెళ్దామని ప్రయత్నించాడు – కాని ఆ సిగ్గు అతన్ని మాటిమాటికీ వెనక్కు తరుమసాగింది. ఇది లాభం లేదని ఏవిధమైన ఆలోచనకూ సందివ్వకుండా చప్పున షాపులోకి ప్రవేశించాడు.

అతన్ని చూడగానే – వర్తకుడు ఆతురతతో తన స్థానంనుంచి లేచి ఎదురువచ్చి – ఒక కుర్చీ చూపాడు. షాపు గుమాస్తా అతని వెనుక నిలబడి లాంటిన్ వైపు దొంగచూపులు చూస్తూ – ఇది యజమాని చూస్తే ప్రమాదమని, తన సంతోషాన్ని బైటపడనివ్వటంలేదు.

"నేను దీన్నిగుర్చి విచారించాను....మీరు నిన్న అన్న మాట మీదనేవుంటే – నిన్న చెప్పిన ధరను ఇవ్వగలను" అన్నాడు, వర్తకుడు.

ఒణికేకంఠంతో లాంటిన్ దీనికి ఒప్పుకొని, తను ఆ నగను అమ్మినట్టు రసీదిచ్చి, డబ్బు తీసుకొని ఒణికే చేతుల్తో జేబులో పెట్టుకుంటూ అన్నాడు! "....ఆమెనుంచే నాకు వచ్చిన ఆభరణాలు ఇంకా వున్నాయ్...మీకు వాటిని కొనటం పడుతుందా?"

అతివినయంతో వర్తకుడు, తను అందుకు సిద్ధంగావున్నట్టు సూచించాడు. ఇది విని ఒక గుమాస్తా, చాటుగా, పెద్దగా నవ్వుకొని ఆనందించవచ్చని బైటికివెళ్ళిపొయ్యాడు. ఇంకో గుమాస్తా జేబురుమాలు నోట్లోకుక్కుకొని ఒక మూలకు జేరాడు. లాంటిన్ దీన్ని గమనించనట్టే నటిస్తూ బండిమీద ఇంటికివెళ్ళి ఒకగంటలో మిగతా సొమ్ములన్నీ తీసుకొచ్చాడు. ఆ నగల్లో దాదాపు అన్నీ ఆ షాపులో కొన్నవే! ఇప్పుడు వాటి ధరకోసం

వర్తకుడితో లాంటిన్ వాదించసాగాడు! అవ్వి అమ్మబడ్డ ఖరీదును చూపమని అడగసాగాడు; తనకు రావాల్సిన మొత్తం పెరిగిన కొద్దీ అతని గొంతుకూడా పెద్దదవసాగింది. పెద్దలోలాకులు రెండూ – రత్నాలతో కలిసి, పదివేల రూపాయిల్ని తెచ్చినయ్. ఉంగరాలూ మొదలైన చిన్నచిన్న ఆభరణాలు ముప్పైవేలు! మరొకహారం ఇరవైవేలు!.....మొత్తం లక్ష దాటింది. ఇంత విలువగల ఆభరణాల్ని పోగు చేసుకునేందుకు జీవితంలో కష్టాన్నంతట్నీ వీటికే వినియోగించాల్సి వుంటుందని, వర్తకుడు అభిప్రాయమిచ్చాడు. దీనికి లాంటిన్ సిగ్గువిడిచి...జీవితంలోని రకరకాల పెట్టుబడుల్లో ఇదొకటని తన అభిప్రాయాన్ని ఇచ్చాడు.....వాటి ధర తేడా లేమన్నా ఉంటయ్యేమో చూసుకునేందుకు – మర్నాటివరకూ గడువుపెట్టుకొని – డబ్బు తీసుకొని లాంటిన్ బైటపడ్డాడు.

వీధిలోకిరాగానే పెద్ద రాతి స్తంభాన్ని చూసి, అదొక చిన్న స్తంభమైనట్టు ఎగబాకా లనిపించింది. వీధి మధ్యలో అమర్చబడ్డ చక్రవర్తి రాతివిగ్రహం మీదికెక్కి సవారీలు చెయ్యాలనిపించింది. అతని కిప్పుడు నిజమైన ఆకలి బాధ తెలుస్తోంది. మంచి హొటల్‌కు వెళ్ళి విలువైన భోజనాన్ని తిన్నాడు. బుడ్డి పదేసిరూపాయిలు విలువగల బ్రాందీ తాగాడు. మంచిబండిలో ఎక్కి ఊరంతా తిరగసాగాడు. ఇతర బళ్ళలో తిరిగేవారివయిపు వారు తనకన్న తక్కువస్థితిలో ఉన్నారన్నట్టు ద్వేషభావంతో చూస్తూ, తనుకూడా భాగ్యవంతుడేనని దారేపొయ్యే వాళ్ళందరూ తెలిసేట్టు – తలబైటికి పెట్టి నవ్వసాగాడు. తను...లక్షాధికారి!

కొంతసేపయ్యాక తన గుమాస్తా ఉద్యోగం గుర్తొచ్చింది. ఆఫీసుకు వెళ్ళి మేనేజరు దగ్గర – యీ సువార్త జారీచేశాడు.

“నేను ఉద్యోగానికి రాజీనామా ఇస్తున్నాను...నాకు లక్షరూపాయిల ఆస్తివచ్చింది” అన్నాడు.

తోటి గుమాస్తా లందరితో నూతనభాగ్యం సంగతి చెప్పి....కొత్త జీవితపు ఆశయాల్ని ఏకరువు పెట్టాడు. ఆ రాత్రి పెద్దహొటల్‌లో భోంచేశాడు. తనపక్కనే కూర్చొని భోంచేసే భాగ్యవంతుణ్ని చూసి – తన వాంఛను చంపుకోలేక – తనుకూడా ఐశ్వర్యవంతుడేననేమాట బైటపెట్టాడు. జీవితంలో మొట్టమొదటిసారి విసుగులేకుండా థియేటర్లో కూర్చొని – మిగతా రాత్రి ఒక అందమైన యువతితో గడిపాడు.

ఆరు నెల్లతరువాత అతను తిరిగి వివాహం చేసుకున్నాడు. ఈ రెండోభార్య విలువయిన జీవితానికి బాగా అలవాటుపడి వుండటంవల్ల – అతను అంతగా సౌఖ్యపడలేదు.

– అనువాదం : శేషబాబు